నమస్తే తెలంగాణ
నిజామాబాద్, శనివారం 24 మే 2025
SATURDAY, MAY 24, 2025

## మానాల అభివృద్ధికి కృషి..

### మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, మే 23 : తెలంగాణ ఉద్యమ కాలం నుంచి మానాల గ్రామం తన వెంట ఉన్నదని, కేసీఆర్ సహకారంతో మానాలను అభివృద్ధి చేశానని, ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మానాల దెగావత్ తండాలో శుక్రవారం నిర్వహించిన జగదాంబమాత, సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాల్లో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం సహకరించకుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక మానాలలో అన్ని పనులు పూర్తి చేయడానికి ముందుంటానన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు తండా వాసులు ఘన స్వాగతం పలికారు.

***వివాహవేడుకలో పాల్గొన్న వేముల..***

భీమ్‌గల్, మే 23: భీమ్‌గల్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు రాంచందర్ గౌడ్ వివాహం శుక్రవారం జరిగింది. వివాహానికి మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి.. తన సోదరుడు అజయ్‌రెడ్డితో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## గ్రామపాలన అధికారుల రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

### అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

కంఠేశ్వర్, మే 23: గ్రామపాలన అధికారుల నియామకం కోసం ఆదివారం నిర్వహించనున్న రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. రాతపరీక్ష ఏర్పాట్లపై ఆయన తన ఛాంబర్‌లో అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 330 మంది అభ్యర్థులు రాత పరీక్షకు హాజరు కానున్నారని, వీరికి నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష ఉంటుందని సూచించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని హితవు పలికారు. ఆలస్యంగా వచ్చే వారిని లోనికి అనుమతించబోమని స్పష్టం చేశారు. నిబంధనలు పాటిస్తూ.. అభ్యర్థులకు తగిన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో రాజేంద్రకుమార్, జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వర్‌రావు, ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, తహసీల్దార్ బాలరాజు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ పవన్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు

డిచ్‌పల్లి, మే 23: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు ఏడో రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 6,564 మందికి 6,096 మంది హాజరు కాగా 468 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 3,649 మందికి 3,334 మంది హాజరవగా 315 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

## కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఖలీల్‌వాడి, మే 23: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. ఉదయం నిర్వహించిన మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 2,113మందికి 1867మంది హాజరవగా.. 245మంది గైర్హాజరయ్యారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ నాలుగు, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, కనకమహాలక్ష్మి ఏడు, సిట్టింగ్ స్క్వాడ్‌లు 6, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 12 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ ఇంగ్లిష్ పరీక్షకు 1431మందికి 1331మంది హాజరవగా.. వంద మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ విద్యాధికారి మూడు, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు మూడు, సిట్టింగ్ స్క్వాడ్‌లు ఆరు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 12 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

## దోస్త్ ఐడీతో ఎస్టీలకు నేరుగా అడ్మిషన్లు

ఖలీల్‌వాడి, మే 23: దోస్త్ ఐడీతో ఎస్టీలకు తమ కాలేజీలో నేరుగా అడ్మిషన్ కల్పిస్తామని జిల్లా గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సైదా జైనబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోస్త్ ద్వారా ఇప్పటికే తమ కాలేజీలో 62మందికి ప్రవేశాలు కల్పించామని పేర్కొన్నారు. బీజెడ్‌సీ, ఎంజెడ్సీ, బీబీసీ, ఎంఎస్‌సీఎస్ కోర్సుల్లో ఎస్టీ విద్యార్థులకు సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

## బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు



ధర్పల్లి తహసీల్దార్ శాంతను సన్మానిస్తున్న నాయకులు

ధర్పల్లి, డిచ్‌పల్లి/ మోర్తాడ్/ ముప్కాల్, మే 23: ధర్పల్లి తహసీల్దార్‌గా శాంత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, ఆర్ఐ రాజేశ్వర్ తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చిన్న బాల్‌రాజ్, సొసైటీ చైర్మన్లు చిన్నారెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు ఆమెను సన్మానించి, అభినందనలు తెలిపారు. డిచ్‌పల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సతీశ్‌రెడ్డి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ముప్కాల్ తహసీల్దార్‌గా ముంతాజ్‌బుద్దీన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల్ జిల్లా బీర్పూర్‌లో పనిచేసిన ఆయన బదిలీపై ముప్కాల్‌కు వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కమ్మర్‌పల్లి తహసీల్దార్‌గా ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఆంజనేయులు బదిలీపై పెద్దపల్లి జిల్లాకు వెళ్లడంతో ఇబ్రహీంపట్నంలో పనిచేసిన ప్రసాద్ కమ్మర్‌పల్లికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఆర్ఐ శరత్‌కుమార్, వీఆర్‌ఏలు, సిబ్బంది స్వాగతం పలికారు.

## ఎంపీడీవోకు బెదిరింపు ఫోన్ కాల్

మాక్లూర్, మే 23 : మండల అభివృద్ధి అధికారి లక్ష్మారెడ్డికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి గురువారం బెదిరింపు కాల్ వచ్చినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఏసీబీ అధికారినని.. ఎంపీడీవోపై ఫిర్యాదులు వచ్చాయని రూ. 2 లక్షలు ఇవ్వాలని బెదిరించినట్లు వెల్లడించారు. ఎంపీడీవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా.. ఫేక్ కాల్‌గా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు.

## భార్య కాపురానికి రావడం లేదని ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బోధన్ రూరల్, మే 23: భార్య కాపురానికి రావడం లేదని బోధన్ మండలం కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన బడూర్ సాయికుమార్ (30) తన ఇంటి ఎదుట ఉన్న చెట్టుకు ఉరేసుకొని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్సై మశ్చేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సాయికుమార్‌కు వివాహమై, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏ పని చేయకుండా జులాయిగా తిరగడంతో విసుగు చెందిన సాయికుమార్ భార్య.. పిల్లలతో కలిసి ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లింది. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది, మద్యానికి బానిసైన సాయికుమార్ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దు

శక్కర్‌నగర్, మే 23: ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో పిల్లలను చేర్పించవద్దని బోధన్ ఎంఈవో నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల జాబితా బోధన్ మండల విద్యావనరుల కేంద్రంలో అందుబాటులో ఉంచామని, పిల్లలను పాఠశాలల్లో చేర్పించే ముందు తల్లిదండ్రులు పాఠశాలల గుర్తింపుపై వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించాలి

### బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



స్థానిక అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

బోధన్ రూరల్, మే 23 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విషయంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. బోధన్ ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించి ఎంపీడీవో బాలగంగాధర్, ఎంపీవో మధుకర్‌లతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసే కార్యక్రమాన్ని త్వరగా ప్రారంభించి, ఇండ్ల నిర్మాణాల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. అనంతరం రాజీవ్ యువ వికాస్ పథకంలో భాగంగా వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను గుర్తించే విషయంపై పలు సూచనలు చేశారు. వచ్చేనెల 5వ తేదీనుంచి ప్రారంభమయ్యే మొక్కలు నాటే కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.

## జాతీయస్థాయి క్రీడాకారుడికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న రిటైర్డ్ ఎంఈవో

బోధన్, మే 23 : మండలంలోని సంగెం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థి బానోత్ చందు మెదక్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ జట్టు తరపున ప్రాతినిథ్యం వహించి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 29న చండీఘర్‌లో నిర్వహించే సాఫ్ట్‌బాల్ పోటీలకు వెళ్తున్న సందర్భంగా రిటైర్డ్ ఎంఈవో బాల గంగాధర్ రూ. 5 వేలు శుక్రవారం అందజేశారు. సదరు విద్యార్థికి తండ్రి లేకపోవడం, తల్లి కూలీ పని చేసి క్రీడల్లో ప్రోత్సహించడాన్ని అభినందించారు. ఆర్థిక సాయం చేసిన బాల గంగాధర్, వ్యాపారవేత్త వెంకటేశానికి బానోత్ చందు, అతడి తల్లి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎఫ్ఎల్ఎం ట్రైనింగ్‌ను పరిశీలించిన డీఈవో



డీఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆర్మూర్‌టౌన్, మే 23 : ఆలూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో కొనసాగుతున్న ఎఫ్ఎల్ఎం ట్రైనింగ్ కార్యక్రమాన్ని డీఈవో అశోక్ శుక్రవారం సందర్శించారు. ట్రైనింగ్ వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈవోను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

## జీలుగ విత్తనాల పంపిణీ



జీలుగ విత్తనాల పంపిణీని ప్రారంభిస్తున్న కోనాసముందర్ సొసైటీ చైర్మన్ బాపురెడ్డి

మోర్తాడ్, మే 23: మండలంలోని కోనాసముందర్ సొసైటీలో జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సొసైటీ చైర్మన్ సామ బాపురెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం 50 శాతం సబ్సిడీపై రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రకాశ్, సొసైటీ ఉపాధ్యక్షుడు ఆకుల రాజన్న, డైరెక్టర్లు శ్రీనివాస్, నవీన్, సాయన్న, రైతులు పాల్గొన్నారు.

## అందుబాటులో జీలుగ విత్తనాలు

రుద్రూర్, మే 23: రుద్రూర్ మండలంలోని రాయకూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఈవో వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీతో వచ్చి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ప్రకారం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## కోటగిరి విద్యార్థికి సైనిక్ స్కూల్‌లో సీటు



బిశ్వజిత్

కోటగిరి, మే 23: కోటగిరికి చెందిన కర్నె బిశ్వజిత్ సైనిక్ స్కూల్‌లో సీటు సాధించాడని విద్యార్థి తల్లిదండ్రులు రూప – గోపినాథ్ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో బిశ్వజిత్ 300 మార్కులకు 254 మార్కులు సాధించి, ఆలిండియా స్థాయిలో 5,929 ర్యాంక్ సాధించాడన్నారు. విద్యార్థి సైనిక్ స్కూల్‌లో సీటు సాధించడంపై యశశ్రీ పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు అభినందించారు. తల్లి రూప కోటగిరి కస్తూర్బా బాలికల పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పనిచేస్తుండగా.. గోపినాథ్ బోధన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

## మాక్లూర్‌లో 35.2 మి.మీ. వర్షపాతం

మాక్లూర్, మే 23 : మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 35.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో భూపాల్ తెలిపారు. మూడు రోజులుగా మండలంలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధాన్యం తడవకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## ముగిసిన డ్రాయింగ్ శిక్షణ

### బొమ్మలు గీయడం, రంగులు వేయడంపై అవగాహన

శక్కర్‌నగర్, మే 23: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో క్రియేటివ్ కిడ్స్ డ్రాయింగ్ అకాడమీ నెలరోజులుగా కొనసాగుతున్న డ్రాయింగ్ శిక్షణ శుక్రవారం ముగిసింది. డ్రాయింగ్ మాస్టర్ మాస్టర్ లక్ష్మణ్ తేజ మాట్లాడుతూ చిన్నారులకు బొమ్మలు గీయడం, రంగులపై అవగాహన, ప్రైమరీ కలర్స్, సెకండరీ కలర్స్, హ్యాండ్ రైటింగ్‌లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంబెల్లి శంకర్, ఖైరాన్, గంగాధర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

## వానకాలం పంటల సాగుపై నేడు రైతులకు అవగాహన

సారంగాపూర్, మే 23: వానకాలం పంట సాగు విధానంపై రైతులకు మండలంలోని గుండారం గ్రామ రైతువేదిక భవనంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏఈవో హీరా జాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుద్రూర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు కార్యక్రమానికి హాజరై రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. రైతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నేడు మాధవ్‌నగర్ సొసైటీలో అంతర్జాతీయ సహకార సంవత్సర ఉత్సవం

సారంగాపూర్, మే 23: నగర శివారులోని మాధవ్‌నగర్ సొసైటీ కార్యాలయ ఆవరణలో శనివారం అంతర్జాతీయ సహకార సంవత్సర ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సొసైటీ సీఈవో వంశీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు, ఆయా రంగాల నిపుణులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. సొసైటీ పరిధిలోని రైతులు, సహకార సంఘాల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## మాలమహానాడు మండల కమిటీ ఎన్నిక

మాక్లూర్, మే 23 : మాక్లూర్ మండల మాల మహానాడు కమిటీని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చొక్కా దేవీదాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా బేగరి రవి, కోశాధికారిగా డీసీ గంగాధర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. మాలమహానాడు అభ్యున్నతికి కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్, చింతల మోహన్, భోజన్న, బ్యాగరి రవి, మేడే గోపాల్, నారాయణ, బట్టు గంగాధర్, బోపతి రవి, మోహన్, నీరడి సాయన్న, గుండ్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రమేశ్

సిరికొండ, మే 23: కర్రెగుట్టలో కాల్పులు ఆపి, శాంతి చర్చలు జరపాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు రమేశ్ డిమాండ్ చేశారు. సిరికొండలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛత్తీస్‌గడ్ అడవుల్లోని అటవీ సందపను అదాని, అంబానిలాంటి కార్పొరేటర్లకు అప్పగించడానికి కేంద్రం 'ఆపరేషన్ కగార్' చేపట్టిందని ఆరోపించారు. గిరిపుత్రులు, మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు నిర్వహించి హతమార్చడం దారుణమన్నారు. కేంద్రం చేపట్టిన అధర్మ యుద్ధానికి వ్యతిరేకంగా అందరూ నిలబడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కిశోర్, దామోదర్, లింబాద్రి, రమేశ్, నరేశ్, రవి పాల్గొన్నారు.

### 'ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి'

ఆర్మూర్‌టౌన్,మే23: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మేధావులు, ప్రజాస్వామికవాదులు, మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న వారిని ఖాళీ చేయించి, అటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకే ఆపరేషన్ కగార్ చేపట్టిందని విమర్శించారు.

## సీసీహెచ్‌ల వేతనాలు విడుదల

ఖలీల్‌వాడి, మే 23: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి సంబంధించి 2025–26 సంవత్సరానికి సీసీహెచ్‌ల గౌరవ వేతనం 2 వేల చొప్పున రూ.59,27,000 బడ్జెట్‌ను మండలాల వారీగా విడుదల చేసిందని జిల్లా విద్యాధికారి అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల విద్యాధికారులకు సీసీహెచ్‌ల గౌరవ వేతనాలను విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. త్వరలో బిల్లులు సీసీహెచ్‌ల ఖాతాలో జమ అవుతాయని పేర్కొన్నారు.

## 'ఉమెన్ ఫర్ ట్రీస్' ప్రారంభం



ఉమెన్ ఫర్ ట్రీస్ ను ప్రారంభిస్తున్న బల్దియా కమిషనర్

కంఠేశ్వర్, మే 23: ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ మేరకు ఆయన కాలూర్ చెరువును సందర్శించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5వ తేదీ నుంచి చెరువు కట్ట వెంట సుమారు 400 మొక్కలు నాటడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. మొక్కలను పోషించే బాధ్యత స్థానిక మహిళా సంఘాలకు అప్పగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

***ఆర్మూర్‌లో..***

ఆర్మూర్‌టౌన్, మే 23: ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ ఆధ్వర్యంలో ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమృతమిత్ర కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులతో ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మున్సిపల్ ఏఈ కిరణ్, మెప్మా టీఎంసీ ఉదయ్ శ్రీ, రాజలింగం, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## మారుతీ ఆలయ మడిగెలకు వేలం

శక్కర్‌నగర్, మే 23: బోధన్ పట్టణంలోని మారుతీ మందిరానికి చెందిన రెండు మడిగెల నెలవారీ చొప్పున అద్దెకు దేవాదాయశాఖ అధికారులు శుక్రవారం వేలం నిర్వహించారు. 5వ నంబర్ మడిగెను రూ. 7,100కు కాళీదాస్ చారి, 6వ నంబర్ మడిగెను రూ.7,200కు హన్మాండ్లు చారి దక్కించుకున్నారు. దేవాదాయశాఖ పర్యవేక్షకురాలు కమల, ఆలయ ఈవో రాములు సమక్షంలో వేలం నిర్వహించారు. చక్రేశ్వర శివమందిరం చైర్మన్ హరికాంత్ చారి, ఆలయ అర్చకుడు ప్రవీణ్ మహరాజ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు, పాలకవర్గం, వీడీసీ అధ్యక్షుడు గంగాధర్ రావు పట్వారీ పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

కోటగిరి, మే 23: ప్రాథమిక స్థాయి విద్యార్థులకు బాగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. కోటగిరి జడ్పీహెచ్‌లో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ట్రైనర్లు ఇస్తున్న శిక్షణ తీరును పరిశీలించారు. కార్యక్రమంలో పొతంగల్ ఇన్‌చార్జి ఎంఈవో లోల శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

***కోటగిరిలో..***

కోటగిరి, మే 23: కోటగిరిలోని జడ్పీహెచ్ఎస్‌లో వేసవి శిక్షణా శిబిరం కొనసాగుతున్నది. ఉదయం యోగా నేర్పించగా.. డ్రాయింగ్‌లో టీచర్ సౌందర్య శిక్షణ ఇచ్చారు. అంతకుముందు శిక్షకుడు మాయన్ విద్యార్థులకు కరాటే నేర్పించారు. విద్యార్థులకు స్నాక్స్ అందించారు.

## ఇంటర్ ప్రశ్నపత్రాల బాక్స్‌ల పరిశీలన



డిచ్‌పల్లి పోలీసుస్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నపత్రాల బాక్స్‌లను పరిశీలిస్తున్న అధికారులు

ఖలీల్‌వాడి, మే 23: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ, పర్యవేక్షణలో భాగంగా జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యుడు చిన్నయ్య శుక్రవారం డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో నిక్షిప్తం చేసిన ప్రశ్నపత్రాల బాక్సులు, ఫైళ్లను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో కస్టోడియన్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారుల సమయపాలన, పనితీరును సమీక్షించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రశ్నపత్రాల పాకెట్ సెట్, ఇంటర్ బోర్డు ప్రకటించిన సెట్ సరిపోల్చుకోవాలని ఇంటర్ విద్యాధికారి వారికి ఆదేశించారు. జిల్లా బాలుర జూనియర్ కళాశాల, ధర్మారం రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల, డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిచ్‌పల్లి మోడల్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి తనిఖీ చేశారు.

## వన మహోత్సవానికి 48లక్షల మొక్కలు సిద్ధం

- మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు
- గతేడాదితో పోలిస్తే పెరిగిన మొక్కల లక్ష్యం
- జూన్ మూడో వారంలో 'వన మహోత్సవం'..?

కంఠేశ్వర్, మే 23: జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. వానకాలం ప్రారంభం కానుండడంతో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో 530 నర్సరీల్లో 48 లక్షల మొక్కలు సిద్ధంగా ఉండగా 28 లక్షల మొక్కలు గ్రామాల వారీగా నాటేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. గత ఏడాది ఇంటింటికీ మొక్కల పంపిణీతో కలుపుకొని 21 లక్షల మొక్కలు లక్ష్యంగా ఉండగా ఈ ఏడాది 28 లక్షల లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. గ్రామ పంచాయతీలోని ప్రతి ఇంటికీ మూడు నుంచి ఐదు మొక్కలు నాటేలా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. మొక్కలు నాటే క్రమంలో జాగ్రత్తలు తీసుకునేలా ప్రతి ఏడాది వన మహోత్సవంలో భాగంగా అధికారులు మొక్కలు నాటడం వదిలేయడం పరిపాటిగా మారింది. కొన్ని గ్రామాల్లో నాటిన మొక్కలను పశువులు తినగా మరికొన్ని గ్రామాల్లో నీళ్లు లేక ఎండిపోవడం, కొన్ని గ్రామాల్లో కరెంట్ వైర్ల కింద పెరిగిన చెట్లను కొట్టివేయడం, ఎండాకాలంలో నీటి సరఫరా సరిగ్గా తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లక్షల కొద్ది ప్రజాధనం వృథా కాకుండా నాటిన మొక్కలను జాగ్రత్తగా స్థలాలు పరిశీలించి నాటాలని మొక్కలు పెరిగి ఉపయోగకరంగా ఉండాలని కేవలం మొక్కలను పంచి నాటేలా ప్రణాళిక రూపొందించడం కాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నాటిన మొక్కలు జాగ్రత్తగా పెరిగేలా చర్యలు చేపట్టేలా సిబ్బందిని ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు.

### జూన్ మూడో వారంలో నిర్వహణ

వనవాసంలో భాగంగా ఈ సంవత్సరం 28 లక్షలు నాటాలని లక్ష్యంగా ప్రణాళిక రూపొందిస్తున్నాం. మొక్కలు నాటే క్రమంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలు చేస్తున్నాం. పూర్తిస్థాయిలో వర్షాలు పడితే జూన్ మూడో వారంలో వనమహోత్సవ కార్యక్రమం ప్రారంభించే అవకాశాలున్నాయి.

*- డీఆర్డీవో సాయాగౌడ్*

## అవార్డుల ప్రదానం



అవార్డును అందుకుంటున్న జ్యోతిరాజ్

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డిస్ట్రిక్ట్ చైర్మన్, బోధన్ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయల్ కోశాధికారి దమ్మశ్ల జ్యోతీ రాజ్ సికింద్రాబాద్‌లోని సమ్మర్ గ్రీన్ రిసోర్ట్‌లో నిర్వహించిన లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ 320డీ అవార్డును శుక్రవారం అందుకున్నారు. స్వచ్ఛంద కార్యక్రమాలు చేపడుతున్నందుకు లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ (320డీ) డిస్ట్రిక్ట్ గవర్నర్ అమర్‌నాథ్‌తో పాటు లయన్స్ ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. నిజామాబాద్ నుంచి లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ సభ్యుడు, రాష్ట్ర అదనపు కార్యదర్శి కరిపె రవీందర్‌కు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్‌ప్రెసిడెంట్ మనోజ్‌షా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఘట్టమనేని బాబూరావుతో కలిసి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా కరిపె రవీందర్ మాట్లాడుతూ తనకు అవార్డు అందించిన మనోజ్ షా, బాబూరావు, పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ బసవేశ్వర్‌రావు లక్ష్మికి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. కిశోర్, శ్రీనివాసరావు, నర్సింహారెడ్డి, సీనియర్ లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్/శక్కర్‌నగర్, మే 23

## వెకేషన్ బైబిల్ స్కూల్ ప్రారంభం

శక్కర్‌నగర్, మే 23: శక్కర్‌నగర్‌లోని సీఎస్ఐ చర్చిలో వెకేషన్ బైబిల్ స్కూల్‌ను చర్చి ఫాదర్ రెవరెండ్ డాక్టర్ ముల్కల ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు యువతకు మిషనరీ కథలు, బైబిల్‌లోని అంశాలు, జ్ఞాపకశక్తి పెంచే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. రెవరెండ్ స్టీఫెన్, పాస్టర్ రవి, ఎడ్వర్డ్, టీచర్ సిమన్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.